క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష గ్రామసభ

వలేటివారిపాలెం: మండలంలోని పోకూరు గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ రషీక్ అహ్మద్‌తెలిపారు. గ్రామ సభ ఎంపీడీఓ రషీక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంద న్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు జరుగుమల్లిలో విద్యుత్ అదాలత్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏఈ గుంజి హర్షీష్ తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలపై అర్జీలిస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. విద్యుత్ శాఖ కందుకూరు డీఈ వీరయ్య, ఒంగోలు సీనియర్ అకౌంట్స్ అఫీసర్ కె.సుబ్బారావు, సింగరాయకొండ ఏడీఈ యుగంధర్ పాల్గొంటారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొగాకు అత్యధిక ధర రూ.250

కందుకూరు: పొగాకు వేలంలో అత్యధిక ధరలు కొనసాగుతున్నాయి. సోమవారం కందుకూరు వేలం కేంద్రాల్లో కేజీ పొగాకు అత్యధిక ధర రూ.250 పలికింది. వీటిలో కందుకూరు-1వ వేలం కేంద్రంలో 895 బేళ్లను వేలానికి ఉంచగా 842 బేళ్లు, కందుకూరు-2 వేలం కేంద్రంలో 851 బేళ్లను వేలానికి ఉంచగా 789 బేళ్లు అమ్ముడైపోయాయి. రెండు వేలం కేంద్రాల్లోనూ అత్యధిక ధర రూ.250, అత్యల్ప ధర రూ. 160 లభించింది.

1150 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేత



సర్టిఫికేట్లు అందజేస్తున్న తహసీల్దార్ సంజీవరావు

టంగుటూరు: మండలంలోని కొణిజేడు గ్రామ సచివాలయంలో సోమవారం తహసీల్దార్ సంజీవరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న 1150 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నర్రా జగదీష్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, సర్పంచి గుంజి వెంకయ్య,మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, పార్టీ నేతలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

65 పొగాకు బేళ్ల తిరస్కరణ



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 65 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. తూర్పునాయుడుపాలెం, కమ్మవారిపాలెం గ్రామాల రైతులు 1192 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1127 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.250, కనిష్ట ధర రూ.159, సరాసరి ధర రూ.232.35 పలికింది. వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

847 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

లింగసముద్రం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేస్-3లో భాగంగా స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పెదపవని-2, ముత్యాలపాడు, చినపవని సచివాలయాల పరిధిలో సోమవారం 847 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బాలికల గురుకులంలో ప్రవేశాలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని నాగులపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2023-24 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో బాలికలకు ప్రవేశాలు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ పీ విశ్వరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 97045 50091, 70321 32073 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుర్రా



కందుకూరులో జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కనిగిరి రూరల్: తన కవిత్వం, రచనలతో సమాజ చైతన్యానికి ఎనలేని కృషి చేసిన గొప్ప కవి గుర్రం జాషువా అని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న విగ్రహానికి ఎమ్మెల్యే బుర్రా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ నాయకులు జి.రవి కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మూఢాచారాలపై తిరుబాటుబావుటా ఎగురవేసిన నవయుగ కవి అని కీర్తించారు. సమాజాన్ని మేల్కొలిపి ఎన్నో కవిత్వాలు, రచనలు రాసిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సానికొమ్ము రంగనాయకులరెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజా సంఘాలు, దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో జాషువ వర్ధంతి నిర్వహించారు.ఆయా సంఘాల నాయకులు జాషువ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసుల యాదవ్, పూలే సేవాసమితి అధ్యక్షుడు దేపూరి వెంకటేశ్వర్లు, బీసీ సంఘాల నాయకులు పల్లా మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: సాహిత్యం ద్వారా సమాజంలో అసమానతలను, వివక్షతను రూపుమాపేందుకు కృషి చేసిన సహజ కవి గుర్రం జాషువా అని జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిశోర్ అన్నారు. జాషువా 52వ వర్ధంతి సభను స్థానిక సీపీఐ కార్యాలయంలోని బుద్ధి అంబేద్కర్ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు.

జాషువా చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ తన సాహిత్యం ద్వారా సమాజాన్ని చైతన్య వంతం చేశారని, ఆయన సాహిత్యం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దండోరా దాసు మాట్లాడుతూ, జనార్దనస్వామి దేవాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రావుల కొల్లు బ్రహ్మానందం, ఉపాసక గాండ్ల హరిప్రసాద్, సీపీఐ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, బీఎస్పీ కన్వీనర్ బెజవాడ కొండయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుళ్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీసీరోడ్డుకు భూమిపూజచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా, పక్కన నాయకులు

సీసీ రోడ్లతో గ్రామాలకు మహర్దశ

పామూరు: మండలంలోని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణంతో ఆయా గ్రామాలకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. మండలంలోని రేణిమడుగులో రూ.10 లక్షల సచివాలయ నిధులతో నూతనంగా వేయనున్న సీసీరోడ్డుకు సోమవారం స్థానిక ప్రజాప్రతినిదులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఇంటింటికీ కుళాయి, గ్రామాల్లో వీధిదీపాలు, మెరుగైన పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు చేపట్టి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు., కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, నీలం శ్రీరాములు, నీలం వెంకట రమణయ్య, కొల్లా రమణయ్య, మోడీ నరేంద్ర, తేజ, నీలం వెంకటేశ్వర్లు, పిచ్చాల తిరుపతిరెడ్డి, మాలకొండారెడ్డి, నక్కా మాల్యాద్రి, కొల్లా నారాయణ, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కనిగిరి రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని వంగపాడు సచివాలయంలో రైతులకు సోమవారం కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్ తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు, రాయితీలు అందచేస్తున్నట్లు చెప్పారు. ఎంపీటీసీ హజరతమ్మ, సర్పంచ్‌లు పాశం కొండయ్య, నరాల వెంకటరెడ్డి, సిద్ధారెడ్డి, స్థానిక నాయకులు పేతూరు, సునీల్, నరసింహులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న నేతలు

ఎగువపల్లిలో ప్రత్యేక పూజలు

మండలంలోని ఎగువపల్లిలో నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారి గుడిలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీటీసీ హజరతమ్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సిద్ధారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

ఉలవపాడు: మండలంలోని భీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కందుకూరు డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల పై సూచనలు చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ ప్రసాదరావు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను పరిశీలించి టెక్నీషియన్‌కు సూచనలు చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై విచారణ

గుడ్లూరు: ఇసుక అక్రమ రవాణాపై గుడ్లూరులో కందుకూరు సెబ్ అధికారులు సోమవారం విచారణ నిర్వహించారు. సెబ్ సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న మన్నేరు, ఉప్పుటేరు లనుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని పలువురు స్పందన లో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. గుడ్లూరులో పలువురు ట్రాక్టర్ల యజమానులను, టైరు బండ్ల యజమానులను విచారించినట్లు పేర్కొన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

నేటి నుంచి కొండపిలో 10వ రౌండ్ పొగాకు అమ్మకాలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రలో మంగళవారం నుంచి 10వ రౌండ్ పొగాకు అమ్మకాలు చేపడుతున్నట్లు నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు. వేలం కేంద్రం పరిధిలోని అయ్యపరాజుపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాల రైతులు మంగళవారం బేళ్లు తీసుకురావాలని సూచించారు. 26న ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కొరిపాలెం, తాటాకుల పాలెం, 27న పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం, చవటపాలెం, దాదానాయుడు పాలెం, దాసిరెడ్డి పాలెం, కొండపి, 28న పెట్లూరు, ఎస్.కంభ్రిక, వర్ధినేనిపాలెం, జగ్గరాజుపాలెం, 31న అయ్యపరాజుపాలెం, నర్సరాజుపాలెం, పెదకండ్లగుంట, ఆగస్టు ఒకటో తేదీన మూగచింతల, గురప్పడియ, నెన్నూరుపాడు, సతుకుపాడు, కె.అగ్రహారం గ్రామాల రైతులు వేలానికి బేళ్లు తెచ్చుకోవాలని చెప్పారు. 150 కిలోలకంటే ఎక్కువ బరువున్నా, అధిక తేమ శాతం, వేడి, అలాగే డ్యామేజీ, న్యూస్ పేపర్ ఉన్న బేళ్లను వ్యాపారులు తిరస్కరిస్తారని స్పష్టం చేశారు.

మున్సిపల్ స్పందనకు 5 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ శ్రీరామమూర్తి

కందుకూరు: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 5 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి కమిషనర్ బి.శ్రీరామమూర్తి తెలిపారు. వీటిలో వ్యక్తి గత సమస్యలు, పట్టణంలోని పలు సమస్యలకు చెందిన అర్జీలు ఉన్నట్లు తెలిపారు. స్పందన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పట్టణంలో ఏమైనా సమస్యలు ఉంటే 9177700267 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుడ్లూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ ఎరుకలయ్య (60) అనే వ్యక్తి సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గత సోమవారం మండలంలోని బసిరెడ్డిపాలెం వద్ద రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో పూరేటిపల్లి గ్రామానికి చెందిన గోగుల ఎరుకలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ ఎరుకలయ్యను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యంకోసం బంధువులు గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎరుకలయ్య సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంభసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి



జరుగుమల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

- ఎంపీడీఓ జలజాక్షి

జరుగుమల్లి(సింగరాయకొండ): ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎంపీడీఓ కె.జలజాక్షి సూచించారు. జరుగుమల్లిలోని ఎంఈఓ కార్యాలయం వద్ద ఇటీవల పదోన్నతిపై, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎక్కడ విధులు నిర్వహించిన విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ బి.నాగేంద్రవదన్, డి.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షం నీరు

బేస్తవారిపేట: మండలంలోని జెన్నీవారిపల్లె ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. బస్టాండ్ సమీపంలో లోతట్టుగా ఉండటం, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండాపోయింది. చిన్నపాటి వర్షం పడినా పైవైపు నుంచి వర్షం నీరు రోడ్డుపైకి చేరుతుంది. రూ.లక్షల ఖర్చుతో నిర్మించిన తారు రోడ్డు నీరు నిల్వ ఉండటంతో ఛిద్రమయ్యే అవకాశం ఉందని, రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు

బాల్య వివాహం అడ్డగింత



బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్, మహిళాపోలీస్

పామూరు: మండలంలోని ఇనిమెర్ల ఎస్సీకాలనీలో బాల్య వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం అక్కడికి చేరుకుని బాల్యవివాహం ఏర్పాట్లను నిలిపివేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, మహిళా పోలీస్ సలోమిలు తెలిపారు. ఇనిమెర్ల ఎస్సీ కాలనీలో అములూరి రామయ్య మేరి దంపతుల కుమార్తెకు వివాహం చేయనుండగా.. సమాచారం అందడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మహిళాపోలీస్, స్వచ్ఛందసేవా సంస్థ వారు వారికి ఇంటికి వెళ్లి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహం నేరమని, కనీస వయస్సు 18 ఏళ్ల పూర్తయిన తరువాతే వివాహం చేయాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్‌ఓ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం శ్రీదేవి, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్త పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న సిబ్బంది

ఉలవపాడు: ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయరహదారిపై ఉలవపాడు దక్షిణ బైపాస్ వద్ద సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..పొట్టిశ్రీరాము నెల్లూరులోని పాడేరుపల్లికి చెందిన ఉండేల.మాలకొండారెడ్డి, ఉండేల చినకొండారెడ్డి, చిలకా మహేంద్రరెడ్డి ద్విచక్రవాహనంపై నెల్లూరు నుంచి మర్రిపూడికి స్థలం రిజిస్ట్రేషన్ పనిపై వెళుతున్న సమయంలో చేవూరు నుంచి మన్నేటికోటకు ద్విచక్రవాహనంపై వెళుతున్న రావినూతల కోటేశ్వరరావు, గొడపేరు సుధాకర్‌ల వాహనాన్ని ఢీకొట్టారు. ప్రమాదంలో మాలకొండారెడ్డి, చినకొండారెడ్డి, రావినూతల కోటేశ్వరరావులకు గాయాలయ్యాయి. వీరిని 108లో ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఇద్దరిని ఒంగోలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే బాలినేనికి బొట్ల రామారావు కృతజ్ఞతలు

ఒంగోలు: జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించినందుకు బొట్ల రామారావు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉదయం బాలినేనిని ఒంగోలులోని ఆయన నివాసంలో కలిసిన అనంతరం మీడియాతో రామారావు మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 550 ప్రాథమిక సహకార సంఘాలలో 450 సంఘాలు తమ యూనియన్‌లో సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. రుణం తీసుకున్న ప్రాథమిక సంఘాల లబ్ధిదారులు వెంటనే బకాయిలు చెల్లించాలని, అలా చెల్లించిన వారే త్వరలో మంజూరయ్యే ఎన్‌సీడీసీ సబ్సిడీ రుణాలకు అర్హత పొందుతారని తెలిపారు. త్వరలోనే జిల్లాకు రూ.8 కోట్ల ఎన్‌సీడీసీ నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర ఫెడరేషన్ నుంచి సమాచారం అందిందన్నారు. ఆయన వెంట పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు, రైతు విభాగం నాయకుడు మారెడ్డి సుబ్బారెడ్డి, వల్లంరెడ్డి రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

కులం పేరుతో దూషించాడని కేసు నమోదు

దర్శి: మద్యం సేవించి కులం పేరుతో దూషించాడని బండి వెలిగండ్ల గ్రామానికి చెందిన మక్కెన లోకయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్టా నాగార్జున అనే వ్యక్తిపై స్థానిక ఎస్సై రామకృష్ణ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు కంతా వీరయ్యకు చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన సిమెంట్ దిమ్మెపై లోకయ్య కూర్చుని ఉన్నాడు. నాగార్జున అక్కడకు వచ్చి రాయి తీసుకుని లోకయ్యపై విసిరి కొట్టి దిమ్మెపై కూర్చుంటావా అని కులం పేరుతో దూషించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు తుమ్మలచెరువులో చిన్న షరిగత్



తుమ్మలచెరువులో విద్యుద్దీపాలంకరణలో పీర్ల మఖానం

తర్లుపాడు: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పీర్లపండుగకు ప్రసిద్ధిగాంచిన తుమ్మలచెరువు గ్రామంలో మంగళవారం చిన్న షరిగత్ నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. పీర్ల పండుగకు రెండు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షాజహాన్ రోడ్లకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించారు. గ్రామంలో వీధులన్నీ శుభ్రం చేయించారు. పీర్ల గుండం తవ్వించారు. మంగళవారం సాయంత్రం నుంచి పీర్ల గుండం ప్రారంభమవుతుంది. పెద్దఎత్తున గుండంలో నుంచి మంటలు ఎగిసిపడే సమయంలో భక్తులు పీర్లను ఎత్తుకుని అటు ఇటు తిరిగి గ్రామంలో ఊరేగిస్తారు. ఇప్పటికే గ్రామంలో ఇళ్లన్నీ బంధువుల రాకతో కళకళలాడుతున్నాయి.



మఖానంలో కొలువైన పీర్లు

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు: మండలంలోని రైతులు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది పండ్లతోటలు పెంచేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ నాగప్రసాదు కోరారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, 5 ఎకరాలలోపు సాగుభూమి గల రైతులు, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన వారు, బోరుబావి కలిగి విద్యుత్ సరఫరా ఉన్న వారు అర్హులని తెలిపారు. రైతులు వారి దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం జెరాక్సు, బ్యాంక్ ఖాతా పుస్తకం జెరాక్సు, ఆధార్‌కార్డు జెరాక్సు, ఉపాధి హామీ జాబ్‌కార్డు జెరాక్సు, పాన్‌కార్డు జెరాక్సు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు 3, గ్రామ పంచాయతీ తీర్మానం తీసుకుని ఈ నెల 31వ తేదీలోపు గ్రామ పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకుడు, ఏపీఓలలో ఎవరికైనా అందజేయవచ్చని తెలిపారు. ఈ పథకం ద్వారా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, సపోటా, బత్తాయి, అల్లనేరేడు తోటలు పెంచవచ్చన్నారు. తోటలు సాగుచేసే రైతులకు గుంతలు తీసేందుకు, మొక్కలు నాటడానికి, మొక్కకు ఊత కర్ర కట్టడానికి, మొక్క కొనుగోలుకు, ఎరువులు వేయడానికి, నెల నెలా పర్యవేక్షణకు మూడు సంవత్సరాలపాటు ఉపాధి హామీ పథకం నుంచి డబ్బు చెల్లిస్తారని ఆయన తెలిపారు. ఉద్యానవనశాఖ ద్వారా మైక్రో ఇరిగేషన్ అందజేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.